## క్లుప్తంగా

### తూతూ మంత్రంగా తల్లికి వందనం

ప్రభుత్వంపై మండిపడ్డ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు వేణు



గోపాలపురం: ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇచ్చి ఇప్పుడు ప్రధాన పథకమైన తల్లికి వందనం తూతూ మంత్రంగా అమలుజేశారు తప్ప చిత్తశుద్ధితో కాదని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలి వేణు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలను ఎప్పటికప్పుడు మోసం చేస్తూ వస్తోందన్నారు. తల్లికి వందనం పథకానికి అనేక ఆంక్షలు పెట్టి అర్హులైన సుమారు 30 లక్షల మంది తల్లుల అకౌంట్లు తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకటించినట్టుగా 15 వేలు కాకుండా రూ. 13వేలు మాత్రమే కొంతమంది తల్లుల అకౌంట్లో జమ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అమ్మ ఒడి సాయం అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి దాచుకో దోచుకో అన్న చందంగా ఇసుక, మట్టి, విలువైన ఖనిజ సంపదను దోచుకుంటూ దాచుకుంటున్నారు తప్ప ప్రజాప్రయోజనాలను పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదని ఆరోపించారు. ఏడాది కాలంలో ఎక్కడ చూసినా మాఫియాలు, మహిళలపై అఘాయిత్యాలు, గంజాయి, మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు తప్ప వారిపై చర్యలు చేపట్టడం లేదన్నారు.

### వివాహానికి హాజరైన మాజీ మంత్రి వనిత



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి వనిత

గోపాలపురం: వైఎస్సార్ సీపీ గోపాలపురం నాయకుడు తానేటి రామారావు కుమార్తె వివాహానికి రాష్ట్ర మాజీ హోం మంత్రి, పార్టీ క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు డాక్టర్ తానేటి వనిత శుక్రవారం హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. ఈమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, వింత ప్రసాద్ రెడ్డి, సాలి వేణు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, పఠాన్ అన్సర్‌బాషా, గెల్లా వెంకటశ్రీను, ఖండల్లి సురేష్, యాళ్ల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

### బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



రైతులు, డ్వాక్రా మహిళలను సన్మానిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, బ్యాంక్ అధికారులు

నిడదవోలు రూరల్: ఎస్‌బీఐ శాఖ ద్వారా వినియోగదారులకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని తాడిమళ్లలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాడిమళ్ల శాఖ ఆధ్వర్యంలో రైతులకు, డ్వాక్రా మహిళలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ రైతులకు పంట రుణాలతో పాటు డ్వాక్రా మహిళలకు కలిపి రూ.5 కోట్లు రుణాలు అందిస్తున్నామన్నారు. అనంతరం రైతులకు, డ్వాక్రా మహిళలకు రూ.5 కోట్ల చెక్కును అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బయ్యే రాధారాణి, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, స్థానిక నాయకులు కాపకాయల సూర్యనారాయణ, కొప్పుల శ్రీనివాస్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

ఉండ్రాజవరం: గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారని, ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పాఠశాల ప్రారంభం నుంచి ప్రణాళికతో చదవాలని విద్యార్థులకు మోర్త ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాసు సూచించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా మండలంలో మోర్త, తాడిపర్రు, తదితర గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సీహెచ్.సక్సేనారాజు మాట్లాడుతూ మండలంలో 2025–26 సంవత్సరానికి 3,043 మంది విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లు పాఠశాలలకు సరఫరా చేశామన్నారు. మోర్త ఉన్నత పాఠశాల విద్యా కమిటి చైర్మన్ ఆకుల నరిసింహారావు, తాడిపర్రు సర్పంచ్ కె.నరేంద్ర, విశ్రాంత ప్రిన్సిపాల్ తిరుగు భీమేశ్వరరావు పాల్గొన్నారు.



మోర్తలో విద్యార్థినికి పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న విద్యా కమిటీ అధ్యక్షుడు, ప్రధానోపాధ్యాయుడు

# రహదారి గోతులమయం

- ఇటీవల కురిసిన వర్షాలకు నిడదవోలు– పంగిడి రహదారి ఛిద్రం
- మరమ్మతు పనుల్లో కొరవడిన నాణ్యత
- గోతుల్లో పడి ప్రయాణికులు గాయాలపాలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



నిడదవోలు - పంగిడి రహదారిలో భారీ గోతులు



బ్రాహ్మణగూడెం సెంటర్లో ఛిద్రమైన రహదారిపై వర్షం నీరు

చాగల్లు: రహదారులను మెరిపిస్తామంటూ ఆర్భాటంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిలోపే చేతులెత్తేసింది. స్థానిక నాయకుల జేబులు నింపేందుకు గుంతలు పూడ్చే పనిని ఆగమేఘాల మీద చేపట్టింది. ఆకలి మీద ఉన్న కూటమి స్థానిక నేతలు అవకాశం చిక్కినప్పుడే నాలుగు రాళ్లు వెనకేసుకోవాలని పైపై మెరుగులతో మమ అనిపించారు. ఈ పనుల్లోని డొల్లతనం కొన్నాళ్లకే బయటపడింది. ఇప్పుడు అడుగుకో గుంత ప్రయాణికులకు స్వాగతం పలుకుతోంది. ఛిద్రమైన రహదారులపై కిలోమీటరు దూరం ప్రయాణం కూడా నరకాన్ని తలపిస్తోంది. ద్విచక్ర వాహనాల్లో వెళ్లేవారు అవస్థల నడుమ ప్రయాణం చేయక తప్పని పరిస్థితి.

### ప్రమాదకర ప్రయాణం

నిడదవోలు–పంగిడి ప్రధాన రహదారిలో గోతులు పూడ్చి పట్టుమని ఆరు నెలలు కూడా గడవలేదు. అంతలోనే గుంతలు మళ్లీ పుట్టుకొచ్చాయి. గుంతలు పెద్దవిగా ఉండడంతో వర్షపు నీరు నిలిచి వాహనదారులకు లోతు తెలియక నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నాడు. ఈ దారిలో తారు లేచిపోయి గుంతల దర్శనమిస్తుండటంతో వాహన చోదకులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణం సాగిస్తున్నారు.

మండలంలో నిత్యం రద్దీగా ఉండే నిడదవోలు–పంగిడి ప్రధాన రహదారి ఛిద్రంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గోతలమయమైంది. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై రాళ్లు లేచిపోయి ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రోడ్లపై ఏర్పడ్డ గోతుల్లో పడి చాలా మంది ప్రయాణికులు గాయాలపాలువుతున్నారు. వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం నిడదవోలు– పంగిడి రహదారికి చేపట్టిన మరమ్మతు పనుల్లో నాణ్యత లోపించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు పడిన గోతుల్లో తాత్కాలికంగా మరమ్మతులు చేశారని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రధానంగా సిమెంట్ రోడ్డు, బీటీ రోడ్డు కలయిక ప్రాంతంలో భారీ గోతులు పడ్డాయి. వాటిని ప్రయాణికులు గమనించకపోవడంతో ఒక్కసారిగా ఆ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

### తరచూ ప్రమాదాలు

ఇటీవల చాగల్లు శివారులో జూనియర్ కళాశాల వద్ద జరిగిన ప్రమాదంలో భార్యాభర్తలు ప్రమాదానికి గురై తీవ్రగాయాల పాలయ్యారు. బ్రాహ్మణగూడెంకు చెందిన యువకులు స్కూటీపై వెళ్తూ ప్రమాదానికి గురై కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. మీనానగరానికి చెందిన వ్యక్తి మోటార్ సైకిల్‌పై వెళ్తూ ప్రమాదానికి గురై తీవ్రగాయాలు పాలయ్యాడు. బ్రాహ్మణగూడెం శివారులో సీసీ రోడ్డు, బీటీ రోడ్డు కలయక వద్ద గొయ్యి ఏర్పడటంతో జరిగిన ప్రమాదంలో నిడదవోలుకు చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలపాలయ్యాయి. ఈ రహదారిలో బ్రాహ్మణగూడెం, మీనానగరం, చాగల్లు, గ్రామాల్లో ఏర్పడ్డ గోతుల వద్ద ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చాగల్లు, బ్రాహ్మణగూడెం వద్ద రహదారి మరింత అధ్వానంగా ఉంది. గోతులు పెద్దవిగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చర్యలు తీసుకుని ఇప్పుడైనా తాత్కాలికంగా కాకుండా పూర్తి స్థాయిలో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

### గోతుల్లోకి వర్షం నీరు



నిడదవోలు, పంగిడి రహదారుల్లో గోతులమయం కావడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా సిమెంట్ రోడ్డుకి చివరల్లో భారీ గోతులు ఏర్పడటంతో ద్విచక్ర వాహనచోదకులు అదుపు తప్పి పడిపోతున్నారు. వర్షాకాలంలో గోతులు కనిపించకపోవడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుని గోతులను పూడ్చాలి.

–ఉండవల్లి నాగేశ్వరరావు, బ్రాహ్మణగూడెం

### తల్లికి వందనంలో నిబంధనలతో మోసం



ఎంపీపీ పోశిరాజు

తాళ్లపూడి: తల్లికి వందనం పథకం అమలులో నిబంధనల పేరుతో ప్రభుత్వం మోసం చేస్తోందని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు విమర్శించారు. ఎన్నికల సమయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను విమర్శించి నేడు అదే అమ్మ ఒడి పథకాన్ని ఏ మార్పులు లేకుండా తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోశిరాజు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.13 వేలు వేయడం మోసం కాదా అని ఆయన ప్రశ్నించారు. 300 యూనిట్లు దాటిని వారిని పథకానికి అనర్హులను చేయడం సిగ్గు చేటన్నారు. పలు రకాల నిబంధనలతో చాలామందిని అనర్హులగా తొలగించి తల్లులను మోసం చేశారని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే ఎటువంటి షరతులు లేకుండా అందరి తల్లులకు పథకం వర్తింపజేయాలన్నారు.

### నేడు యోగాంధ్ర కార్యక్రమం

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరులోని గోష్పాద క్షేత్రం వద్ద శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ తెలిపారు. యోగా కార్యక్రమం ఉదయం 7 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ చైర్‌పర్సన్, ఇతర ప్రజాప్రతినిధులు, ఇతర జిల్లాస్థాయి అధికారులు, కొవ్వూరు డివిజన్ స్థాయి అధికారులు హాజరుకానున్నట్టు తెలిపారు.

# కొనసాగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు



పెరవలిలో మట్టిని తవ్వి ట్రాక్టర్‌పై వేస్తున్న పొక్లయినర్



పెరవలి తహసీల్దార్ కార్యాయం ఎదురుగా మట్టి లోడుతో వెళుతున్న ట్రాక్టర్

- అధికారుల కళ్లముందే యథేచ్ఛగా మట్టి తరలిస్తూ ట్రాక్టర్ల రాకపోకలు
- చర్యలకు వెనుకంజ వేస్తున్న అధికారులు

పెరవలి: అక్రమ మట్టి తవ్వకాలు కొనసాగుతున్న అధికారులు చూసీచూడనట్లు వదలివేయడంతో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వ కార్యాలయాల ఎదురుగా, అధికారుల కళ్లముందే ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారు. మట్టి తవ్వకాలకు మైనింగ్, రెవెన్యూ అధికారుల అనుమతులు తీసుకోవలసి ఉన్నా వాటిని బేఖాతర్ చేస్తూ మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. మండల స్థాయి నాయకుడు కనుసన్నల్లో ఈ మట్టి దందా కొనసాగుతోందని అందుకే ఇంత నిర్భయంగా మట్టిని తరలిస్తున్నారని పలువురు అంటున్నారు. మట్టి తవ్వకాలపై పత్రికల్లో వార్తలు వస్తుంటే ఆరోజు నిలుపుదల చేసి మరుసటి రోజు అనుమతులు వచ్చాయంటూ తవ్వకాలు ప్రారంభిస్తున్నారు. మండల కేంద్రమైన పెరవలి, కాపవరం, ఖండవల్లి, పిట్టల వేమవరం, నడుపల్లి గ్రామాల నుంచి వందలాది ట్రాక్టర్లు మట్టి తరలిపోతున్నా అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారా? అని పలువురు విమర్శిస్తున్నారు.

**కూటమి నేతల బెదిరింపులు..**
**మౌనం వహించిన అధికారులు**

మట్టి తవ్వకాలకు అనుమతులు తీసుకోకుండానే యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవటానికి ప్రజా ప్రతినిధులు బెదరింపులే కారణమని పలువురు చెబుతున్నారు. ఏమైనా చర్యలు తీసుకుందామంటే మంత్రిగారి తాలూకా అంటూ బెదిరిస్తున్నారని, అందుకే ఏమీ చేయలేని పరిస్థితిలో నలిగిపోతున్నామని పలువురు అధికారులు వాపోతున్నారు. బుధవారం కొద్దిసేపు పోలీసులు రంగంలోకి దిగి మట్టి ట్రాక్టర్లను నిలుపుదల చేస్తే ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి రావడంతో వాటిని వదలివేసారు. ఎవరైనా ధైర్యం చేసి మట్టి తవ్వకాలను నిలుపుదల చేస్తే మీరు ఇక్కడ ఉండరు అని అధికార పార్టీ నేతలు ప్రభుత్వ ఉద్యోగులపై బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు సరికదా అనుమతుల కోసం వచ్చి అడిగిన వారు కూడా లేకపోవటం విడ్డూరంగా ఉంది.

### తాళ్లపూడి తహసీల్దార్‌గా లక్ష్మీలావణ్య

తాళ్లపూడి: తహసీల్దార్‌గా ఎస్.లక్ష్మీలావణ్య శుక్రవారం తాళ్లపూడిలోని కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. రాజానగరం తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఈమె ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు డిప్యూటీ తహసీల్దార్ మోహన భారతి ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మీలావణ్య మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను, వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆమెకు డిప్యూటీ తహసీల్దార్ మోహనభారతి, ఆర్‌కే రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లు శుభాకాంక్షలు తెలిపారు.

# మండల వ్యవసాయాధికారుల బదిలీలు





కమల్‌రాజ్, దేవరపల్లి    సోమశేఖర్, నల్లజర్ల

దేవరపల్లి: కొవ్వూరు డివిజన్ పరిధిలోని గోపాలపురం నియోజకవర్గంలో పనిచేస్తున్న మూడు మండలాల వ్యవసాయాధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేవరపల్లి మండల వ్యవసాయాధికారిగా నల్లజర్ల మండలంలో పనిచేస్తున్న కె.కమల్‌రాజ్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కె.విజయ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం డివిజన్ అల్లవరానికి బదిలీపై వెళ్లారు. నల్లజర్ల మండల వ్యవసాయాధికారిగా కొయ్యలగూడెం మండలంలో పనిచేస్తున్న బి.సోమశేఖర్ బదిలీ అయ్యారు. గతంలో ఆరేళ్లు ఈయన నల్లజర్ల మండల వ్యవసాయాధికారిగా పనిచేశారు. గోపాలపురం మండల వ్యవసాయాధికారిగా అమలాపురంలో పనిచేస్తున్న కూచిపూడి ఏసుబాబు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన బి.రాజారావు ఉండ్రాజవరం మండల వ్యవసాయాధికారిగా బదిలీపై వెళ్లారు.

# వృద్ధుల వేధింపులను నివారించాలి

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమై.. డబ్బు, ఆస్తుల కోసం వృద్ధులపై వేధింపులు పెరుగుతున్నాయని, దీనిని నివారించేందుకు కఠిన చట్టాలు అమలు చేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం స్థానిక సీపీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వృద్ధుల వేధింపుల నివారణకు అవగాహన కరపత్రాన్ని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ మారిసెట్టి జితేంద్ర, ట్రస్ట్ ప్రతినిధులు చింతా ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రసాదరెడ్డి, డాక్టర్ గుబ్బల రాంబాబు ఆవిష్కరించారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ కరపత్రాన్ని అంతర్జాతీయ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం సందర్భంగా ఆదివారం సీనియర్ సిటిజన్లకు, వారి కుటుంబాలకు అందిస్తామని స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు తెలిపారు. వృద్ధుల సమస్యలపై అవగాహన కల్పిస్తూ, గత 27 ఏళ్లుగా వృద్ధుల పునరావాస కేంద్రం ద్వారా వృద్ధులను ఆదరిస్తున్నామన్నారు. వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవాన్ని ఆదివారం స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో జరపనున్నట్లు తెలిపారు. వృద్ధులు వేధింపులకు గురికాకుండా చూడడం అందరి బాధ్యత అని జితేంద్ర తెలిపారు.

# ఫ్యాక్టరీని వెంటనే తెరవాలి



గోపవరంలో ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

గోపాలపురం: మండలంలోని గోపవరంలో ఉన్న భాగ్యనగర్ క్లోరైడ్ ఫ్యాక్టరీ తెరిచి, కార్మికులకు ఉపాధి కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు యాజమాన్యం వైఖరిపై శుక్రవారం ఫ్యాక్టరీ గేటు వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. గత నెలలో ఇద్దరు కార్మికులను అకారణంగా విధుల నుంచి తొలగించిన నేపథ్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. అప్పట్లో తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటామని చెప్పిన యాజమాన్యం.. ఇప్పటి వరకూ విధుల్లోకి తీసుకోకపోవడంతో భాగ్యనగర్ క్లోరైడ్ ప్రైవేటు లిమిటెడ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్టు యూనియన్ నాయకుడు సీహెచ్ రమేష్ తెలిపారు. ఫ్యాక్టరీ తెరిచి, ఉద్యోగులను విధుల్లోకి తీసుకుని, సంస్థ యాజమాన్యం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెందుర్తి రాయుడు, కోటిచుక్కల రాము, సోమరాజు, ఏసు, ఫ్యాక్టరీ కార్మికులు పాల్గొన్నారు.

### జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు

నిడదవోలు : పట్టణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభించినట్టు ప్రిన్సిపల్ బి.గీతాంజలి తెలిపారు. కళాశాలలో అత్యుత్తమ బోధనతో పాటు కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ గ్రూపులతో పాటు ఒకేషనల్‌లో ఆఫీస్ అసిస్టెంట్, (ఓఏసీ) కోర్సులు ఇంగ్లీష్, తెలుగు మీడియంలో అందుబాటులో ఉన్నాయన్నారు. 2024–25లో ఆర్ భావన సీఈసీ గ్రూపులో 974 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సైన్స్ గ్రూప్ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జువాలజీకి సంబంధించిన ల్యాబ్‌లు, విశాలమైన ఆట స్థలం, వసతులతో కళాశాల అత్యుత్తమ ఫలితాలు సాధిస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని ప్రిన్సిపల్ కోరారు.

### రాంబాబు సేవలు ఆదర్శనీయం

ఉండ్రాజవరం: విద్యారంగానికే కాకుండా యూటీఎఫ్ నాయకుడిగా రాంబాబు ఎనలేని సేవలందించారని, అంటువంటి వ్యక్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మండల యూటీఎఫ్ అధ్యక్షుడు వైవీ స్వామి అన్నారు. యివ్వల రాంబాబు స్వచ్ఛంద పదవీ విరమణ సందర్భంగా ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం వీడ్కోలు సభ పాఠశాల హెచ్‌ఎం పి.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం యివ్వల రాంబాబు, రమాదేవి దంపతులను ఉపాధ్యాయులు శాలువా, ప్రశంసాపత్రం, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల హెచ్‌ఎంలు కె.శ్రీనివాసు, కె.ఏడుకొండలు, ఎంజీ.పాల్, ఏపీటీఎఫ్ నాయకులు కోట రామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### రైతుబజార్ ఏర్పాటు చేయాలి

నిడదవోలు : నియోజకవర్గ కేంద్రం నిడదవోలు పట్టణంలో రైతు బజారు ఏర్పాటు చెయ్యాలని సీపీఎం తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జువ్వల రాంబాబు శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలు నేరుగా రైతు బజార్‌లో గిట్టుబాటు ధరలకు అమ్ముకునేందుకు వీలుగా పురపాలక సంఘం నిధులతో భవనం నిర్మించాలని కోరారు. గతంలో సంత మార్కెట్ వద్ద రైతు బజార్ నిర్మించారని, కాలక్రమంలో తొలగించారని ఆయన తెలిపారు.

### పలు గ్రామాల్లో భారీ వర్షం

నిడదవోలు రూరల్: మండలంలోని పలు ప్రాంతా ల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో ప్ర జలు ఇబ్బందులు పడ్డారు. సమిశ్రగూడెం, మునిపల్లి, పురుషోత్తపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు నారుమళ్ల పనుల్లో నిమగ్నమయ్యారు.

### అంగన్‌వాడీ వర్కర్ల ర్యాలీ



తాళ్లపూడిలో అంగన్‌వాడీ వర్కర్ల ర్యాలీ

తాళ్లపూడి: కొత్త విద్య సంవత్సరం ప్రారంభం కావడంతో చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తాళ్లపూడి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించే కార్యక్రమాన్ని అంగన్‌వాడీ పిలుస్తోంది పేరుతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ భాగ్యకుమారి మాట్లాడుతూ మండలంలో 43 మంది వరకు మూడేళ్లు నిండిన పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉండగా, వారిలో 19 మంది మొదటి రోజు ఆయా గ్రామాల పరిధిలోని కేంద్రాల్లో చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.